మహిళల ఆర్థిక ప్రగతే సీఎం ధ్యేయం

'ఆసరా' సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్రంలో మహిళా సాధికారతను సాధించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో శనివారం వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిస్థితులను అవలోకనం చేసుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులను కళ్లారా చూశారని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణ మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు తమను మోసం చేశారని మహిళలు తెలపడంతో... తాను అధికారంలోకి వస్తే నాలుగు విడతలుగా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని జగన్ హామీ ఇచ్చి నెరవేర్చారన్నారు. ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు సాయం అందించి మహిళల ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం దోహదపడుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను రుణ విముక్తులను చేసేందుకు ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధిని మరింత మెరుగుపరచడానికి అమూల్, హిందూస్థాన్ లీవర్ వంటి పెద్ద పెద్ద సంస్థలతోపాటు బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వివరించారు. చేయూత, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలు పేదరికంలో ఉన్న వారి జీవితాలను మార్చి వేశామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం 1291 డ్వాక్రా గ్రూపుల్లో గల 13,703 మందికి 3వ విడత రుణమాఫీ కింద రూ.10.45 కోట్ల మెగా చెక్కు అందజేశారు. ప్రభుత్వ పథకాలపై చక్కగా వివరించి ప్రసంగించిన డ్వాక్రా మహిళ పినిశెట్టి జ్యోతిని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా దుర్గ, నాయకులు లెంక రాంబాబు, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, పల్లా రమణ, గండ్రెడ్డి శ్రీనివాస్, డోల దేవుడు, ఎంపీడీవో లవరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ ధ్యేయం

సింహాచలం: మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ఐదేళ్ల చంద్రబాబు పాలనలో డ్వాక్రా రుణమాఫీ చేయలేదన్నారు. సింహాచలం దేవస్థానం భూ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు.

శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



ప్రార్థన చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కొమ్మాది: విశాఖ ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల జియాన్ కింగ్స్ మినిస్టరీస్ చర్చిలో శనివారం ఎన్నికయ్యింది. నూతన అధ్యక్షుడిగా ఎల్.జాకబ్ రాజ్, కార్యదర్శిగా ఎస్.జయకుమార్, కోశాధికారిగా ఎమ్.కృపానందం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జార్జ్ ముల్లర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధానికి చర్యలు




రాజీవ్‌నగర్‌లో జెడ్సీ కనక మహాలక్ష్మి, తదితరులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్‌లో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి శనివారం పర్యటించారు. ఈ ప్రాంతంలో పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. పాలిథిన్ కవర్ల నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ప్రధాన రహదారులపై చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి, నాయకులు నొడగల రాంబాబు, మాదు చంటి, లొడగల రామ్మోహన్ పాల్గొన్నారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ల వితరణ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు రూ.35వేల విలువైన 11 నెక్ బ్యాండ్ పీఏ సిస్టమ్‌లను అందించారు. వేర్వేరు మీడియంలలో రెండేసి సెక్షన్ల విద్యార్థులకు ఒక్క గదిలో బోధన సమస్యగా ఉండడంతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.గోపాలరావు ద్వారా పూర్వ విద్యార్థులు వీటిని అందించారు. ఇవి 11 సెక్షన్ల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయుడు టి.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. వీటిని డి.శేఖర్‌గుప్తా, కె.సన్యాసిరావు, ఎస్.వెంకటరావు, పి.వెంకట అప్పారావు, వి.సత్యనారాయణరాజు, కె.నరసింగరావు, బి.రాహుల్, ఎల్.శ్రీనివాసరావు, వి.రాజేష్, ఆకిరి ఉమామహేశ్వరరావు అందించారు. వీరిని సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ సరగడ రవి తదితరులు అభినందించారు.

చిట్టివలస మైలురాళ్లను పునరుద్ధరించండి



తగరపువలస - భీమిలి రహదారిలో తొలగించిన చిట్టివలస మైలురాయి

తగరపువలస: 43వ నంబరు జాతీయ రహదారిగా ఉన్న చిట్టివలస – రాయ్‌పూర్ మార్గంలో చిట్టివలస పేరుతో ఉన్న మైలురాళ్లు కనుమరుగుకావడంతో ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భీమిలి – తగరపువలస రహదారి విస్తరణలో భాగంగా చిట్టివలస చెరువు వద్ద 0 నంబరు మైలురాయి, చిల్లపేట వద్ద 1వ నంబరు మైలురాయి కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం 4వ నంబరు మైలురాయి రోడ్డు పక్కన కూల్చివేసి ఉంది. చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన చిట్టివలస పేరుతో ఉన్న అయిదు మైలురాళ్లలో కేవలం రెండే మిగిలి ఉన్నాయంటున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు మైలు రాళ్లను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రన్నర్‌గా చిట్టివలస జట్టు



ట్రోఫీ, నగదు బహుమతి అందుకుంటున్న చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ జట్టు

తగరపువలస: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022 – 23 వార్షిక ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో చిట్టివలస పోలమాంబ జట్టు రన్నర్స్‌గా నిలిచి ట్రోఫీతోపాటు రూ.30వేల నగదు బహుమతి గెలుచుకుంది. 30 జట్లు పాల్గొన్న లీగ్‌లో విన్నర్‌గా నగరానికి చెందిన దుర్గాలమ్మ ఫుట్‌బాల్ క్లబ్ రూ.50వేల నగదు బహుమతి గెలుపొందింది. విన్నర్స్ జట్టును జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు అభినందించారు.

మట్టి రోడ్డును తలపిస్తున్న బీటీ రహదారి



బాందేవుపురం పాఠశాల వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు దూళి రేగుతోంది. ఇది బీటీ రహదారి అయినప్పటికీ మట్టి రోడ్డును తలపిస్తోంది. బీటీ రోడ్డు శిథిలమవడంతో మట్టి రోడ్డుగా మారింది. ద్విచక్ర వాహనం వెళ్తే... వెనుక పూర్తిగా ధూళి కమ్ముతోంది. ఇక ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు వెళ్తే... వాటి వెనుక రేగే ధూళి కారణంగా ఎవరూ ప్రయాణించలేదని దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై గంధవరం, కొత్త కొవ్వాడ, విజయనగరం జిల్లా అలమండ ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీలు రాకపోకాలు సాగిస్తాయి. వాహనాలు రాకపోకలు సాగించే టప్పుడు ధూళి కమ్మేయడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డుగా మారిన ప్రాంతంలో తారుతో అభివృద్ధి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పద్మనాభం: పదో తరగతి పరీక్షలకు మండల విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 3 నుంచి జరగనున్న పరీక్షలకు ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, ఏడు ప్రైవేటు పాఠశాలల నుంచి 676 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 367 మంది, బాలికలు 309 మంది. వీరి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయడానికి 33 గదులను ఏర్పాటు చేశారు. 40 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను మండల విద్యాశాఖ అధికారిణి ఎం.శివరాణి శనివారం పర్యవేక్షించారు. మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆమె సందర్శించి తరగతి గదులు, బెంచీలు పరిశీలించారు.

మండల సచివాలయాల కన్వీనర్‌గా రఘునాథరెడ్డి



తగరపువలస: భీమిలి మండల సచివాలయాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా చిప్పాడ మాజీ సర్పంచ్, పార్టీ జిల్లా కార్యదర్శి సరగడ రఘునాథ రెడ్డి నియమితులయ్యారు. మండలంలోని 16 పంచాయతీల పరిధిలోని 14 గ్రామ సచివాలయాల్లోని 42 మంది కన్వీనర్‌లకు ఈయన కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తనకు అప్పగించిన బాధ్యతల్లో భాగంగా మండలంలోని ప్రతీ ఇంటికి వైఎస్సార్‌సీపీ ఆశయాలు, సీఎం జగన్ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమన్వయంతో ప్రచారం చేస్తామన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు ఎం.బాలరాజు, ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ప్రోత్సహించిన వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, గాడు శ్రీను సూచనలు, సలహాలతో ముందుకు సాగనున్నట్టు రఘునాథరెడ్డి తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

విద్యుత్ స్తంభాలు తొలగించండి



భీమిలి కుమ్మరిపాలెంలో ప్రైవేట్ స్థలంలో విద్యుత్ స్తంభాలు

తగరపువలస: విద్యుత్ శాఖ భీమిలి అధికారులు మా అనుమతి లేకుండా, మేము లేని సమయంలో మా స్థలంలో విద్యుత్ స్తంభాలు వేశారు. 70 ఏళ్ల వయసున్న మా దంపతులం ఇప్పటి వరకు రెండు సార్లు స్పందనలో ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ వాటిని తొలగించలేదు. కృష్ణాకాలనీ కుమ్మరిపాలెం వుడా లేఅవుట్‌లో 1986లో పలువురితో పాటు మేమూ స్థలం కొనుగోలు చేసుకున్నాం. ఉద్యోగాలు, వృత్తులరీత్యా దూర ప్రాంతాలకు వెళ్లిపోయాం. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఇక్కడకు వచ్చి తమ స్థలాలను చూసుకుంటే అందులో స్తంభాలున్నాయి. ఇప్పుడు మా స్థలంలో ఇంటి నిర్మాణం చేపడదామంటే ఆ విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయి. స్తంభాలు తొలగించడానికి రూ.75,739లు చెల్లించాలని అంచనా చార్జీల జాబితా మాకు పంపించారు. 2003 కొత్త విద్యుత్ చట్టం ప్రకారం యజమానుల అనుమతి లేకుండా ప్రైవేట్ స్థలాల్లో విద్యుత్ స్తంభాలు వేయడానికి వీలులేదు. దీనిపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ బి.భవానీ ప్రసాద్ ఇదివరకే స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతి లేకుండా మా స్థలంలో వేసిన విద్యుత్ స్తంభాలు తొలగించాలి.

– పల్లా రాజేశ్వరి, సత్యానారాయణ దంపతులు, కుమ్మరిపాలెం, భీమిలి

స్పీడ్ బ్రేకర్ కనిపించక ప్రమాదాలు



మిథిలాపురి వుడా కాలనీ వీధి రోడ్డులో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో ఓ వీధిలో ఇటీవల బీటీ రోడ్డు నిర్మించారు. అయితే కెనరా బ్యాంకు ఎమ్‌వీవీ ఓజోన్ సిటీ 33 అడుగుల రోడ్డులో అధికారులు అనాలోచితంగా పెద్ద స్పీడ్ బ్రేకరు ఏర్పాటు చేశారు. ఇది రోడ్డులో కలిసిపోయి ఉంది. దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులతోపాటు మేము కూడా ఇబ్బందులు పడుతున్నాం. అందరికీ కనిపించేలా కనీసం స్పీడ్ బ్రేకర్‌కు రంగు వేయిస్తే మంచిది. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– పుష్పావతి, మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ.

దళారుల చేతుల్లో నిమ్మకాయ బంధీ



తగరపువలస మార్కెట్‌లో నాణ్యతలేని నిమ్మకాయలు

తగరపువలస: స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో ఒక్క నిమ్మకాయ రూ.5లకు విక్రయిస్తున్నారు. గత సోమవారం ఇదే నిమ్మకాయ ఒక్కొక్కటి రూ.3లకు విక్రయించారు. దీంతో నిమ్మకాయ ఊసెత్తితే వినియోగదారులు హడలిపోతున్నారు. ఫిబ్రవరి వరకు చవకగా ఉన్నప్పటికీ మార్చి నెల నుంచి ధరలు పెరగడం కనిపించింది. ఈ పెరుగుదల మే చివరి వరకు ఉంటుందని స్థానిక చిల్లర వ్యాపారులు అంటున్నారు. ఏలూరు, విజయవాడ, రాజమండ్రి, రావులపాలెం, జంగారెడ్డిగూడెం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి ఆనందపురం మీదుగా తగరపువలస మార్కెట్‌కు వ్యాపారులు నిమ్మకాయలు తీసుకొస్తుంటారు. ప్రస్తుతం తగరపువలస మార్కెట్‌కు వస్తున్న నిమ్మకాయల్లో నాణ్యత ఉండటం లేదు, రసం కూడా తక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో నిమ్మకాయల ధరలు ఆకాశన్నంటుతుండటంతో వినియోగదారులు ప్రత్యామ్నాయంగా బత్తాయి, నారింజలవైపు వెళ్తున్నారు. సాధారణంగా 1200 నుంచి 1500 నిమ్మకాయల బస్తా రూ.800 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. దీనికి రవాణా, హమాలీ, పెట్టుబడి ఖర్చులు కలిపి రెట్టింపు ధరకు చిల్లర వ్యాపారులకు విక్రయిస్తుంటారు. చిల్లర వ్యాపారులు లాభాలు కలుపుకుని ఒక్కో నిమ్మకాయను రూ.2 వంతున విక్రయించేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరిగి, సరఫరా తగ్గడంతో బస్తా నిమ్మకాయల ధర స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో రూ.3500 నుంచి రూ.4వేల వరకు ఉంటుంది. ముఖ్యంగా నిమ్మకాయల ధరలలో దళారీల వాటాయే ఎక్కువగా ఉంటడంతో సాధారణ వినియోగదారునికి వీటి కొనుగోలు భారంగా మారుతోంది.

సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న దళిత నాయకులు



అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

సామూహిక కోళ్ల పెంపకం పథకం లబ్ధిదారులతో మంత్రి నాగార్జున సమావేశం

ఆనందపురం : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మండలంలో శనివారం పర్యటించారు. మండల కేంద్రం వద్ద 1986లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేసిన సామూహిక కోళ్ల పెంపకం పథకాన్ని వారు పరిశీలించారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో 30 మంది ఎస్సీలకు జీవనోపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసి కోళ్ల పెంపకం షెడ్లు నిర్మించి యిచ్చారని చెప్పారు. కాగా తుఫాన్ల కారణంగా షెడ్లు ధ్వంసమయ్యాయని, తిరిగి తాము పునర్నిర్మించుకున్నామని వివరించారు. మరలా కోళ్ల పెంపకం చేపట్టడానికి విద్యుత్, నీటి సౌకర్యం అవసరముందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ పథకం ఎప్పుడు ప్రారంభించారు, ప్రస్తుతం ఎంత మంది లబ్ధిదారులు స్థానికంగా ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. మిగతా వారు ఎక్కడ నివసిస్తున్నారు... ఒక్కొక్క లబ్ధిదారుడి వివరాలతో కూడిన నివేదికను రూపొందించి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అందజేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమణమూర్తిని ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమయ్యే చర్యలు ఎమ్మెల్యే శ్రీనివాసరావు తీసుకుంటారని వివరించారు. తహసీల్దార్ రామారావు, జోషఫ్, చెన్నా సత్యం, సియ్యాద్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో విద్యుత్ వెలుగులు



విద్యుత్ కాంతుల్లో భీమిలి బీచ్ మెట్లమార్గం

భీమునిపట్నం: భీమిలి బీచ్ రోడ్డులో సుందరీకరణ పనుల్లో భాగంగా లైటింగ్ ఏర్పాటు చేయడంతో కొత్త అందాన్ని సంతరించుంది. జీ – 20 సదస్సును దృష్టిలో పెట్టుకుని కొత్తగా రంగులు వేయడంతో బొమ్మలన్నీ అందంగా తయారయ్యాయి. వాటికి కొత్తగా లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. పూట్‌పాత్‌పై వరుసగా ఉన్న కొబ్బరి చెట్లకు నీలం రంగు లైట్లు ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా ఈ ప్రాంతం లైట్ల వెలుగుతో మెరిసిపోతోంది. తొలిసారి ఇలా లైటింగ్ ఉండడంతో సందర్శకులు కొత్త అనుభూతికి లోనవుతున్నారు. బీచ్‌కు సందర్శకులు ఎక్కువ మంది వస్తుండడంతో లైట్లను తొలగించకుండా కొంత కాలం ఇలాగే ఉంచాలని అధికారులు భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అనిల్ నీరుకొండ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన





ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) రాములమ్మ

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండె వ్యాధి బాధితురాలు కిలిమి రాములమ్మ (65) శనివారం మృతి చెందింది. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైద్యం వికటించి మృతి చెందినట్టు మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా భోగాపురం మండలం గూడెపువలసకు చెందిన రాములమ్మకు కాళ్ల వాపులు రావడంతో వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆమెను అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు గుండెలో సమస్య ఉందని, స్టంట్‌లు వేయాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రెండు స్టంట్‌లు ఉచితంగా వేయడానికి, మూడో స్టంట్‌కు రూ.50వేలు అవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. మళ్లీ బెలూన్ అవసరమవుతుందని, దానికో రూ. లక్ష వరకు అవుతుందన్నారు. దీనికి కూడా బంధువులు అంగీకరించడంతో శుక్రవారం శస్త్ర చికిత్స చేసి స్టంట్‌లు వేశారు. శనివారం ఉదయం రాములమ్మ టిఫిన్ చేసిన తర్వాత వైద్య సిబ్బంది ఇంజక్షన్ చేశారని, ఆమె అటెండెంట్ బయటకు వెళ్లి టీ తాగి వచ్చేసరికి మృతి చెంది ఉందని వాపోయారు. వైద్యం వికటించడంతోనే మృతి చెందినట్టు ఆందోళన నిర్వహించగా భీమిలి పోలీసులు వచ్చి సర్దిచెప్పారు.

స్టంట్‌ల పేరుతో డబ్బుల వసూళ్లు

అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యతో వచ్చేవారి నుంచి అదనపు స్టంట్‌ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 జనవరిలో తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన చొప్ప శంకరరావు అనే వృద్ధుని కుటుంబ సభ్యుల నుంచి ఇలాగే రూ.63 వేలు వసూలు చేశారు.

తర్వాత ఆరోగ్యశ్రీ డెస్క్‌లో ఫిర్యాదు చేయగా మొత్తం తిరిగి ఇచ్చేశారు. అయితే స్టంట్‌ల కోసం డబ్బులు వసూలు చేయడం లేదని ఆస్పత్రి ప్రతినిధులు అంటున్నారు.

అందరికీ విద్య ప్రాథమిక హక్కు

తగరపువలస: దేశంలో 6 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు ఉచితంగా నిర్బంధ విద్య అందించడమే ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం లక్ష్యమని బంగ్లామెట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. పాఠశాలలో విద్యాహక్కు చట్టం ఆవశ్యకతపై విద్యార్థులకు శనివారం వివరించారు. 2009లో రాజ్యాంగంలోని 21ఎ ఆర్టికల్‌లో దీనిని పొందుపరిచారన్నారు. 2010 ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై తనిఖీ అధికారుల ప్రత్యేక దృష్టి

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫ్లెయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లపై ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లో నియమితులైన అధికారులతో శనివారం క్వీన్ మేరీ హైస్కూల్లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో డీఈవో కార్యాలయం నుంచి డ్యూటీ వేసిన వారు మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.